క్లుప్తంగా

రోడ్డుపైకి చేరుతున్న డ్రెయిన్ నీరు


డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా ఉన్న దృశ్యం

భీమవరం అర్బన్‌: మండలంలోని చినఅమిరం గ్రామంలో విశ్వకవి స్కూలుకు వెళ్లే రోడ్డులో ఇటీవల వర్షాలు పడుతుండడంతో డ్రెయినేజీలలో నీరు పేరుకుపోయి స్తంభించిపోయింది. దీంతో రోడ్డుపైకి డ్రెయినేజీ నీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్‌ నీటి వల్ల రాత్రిళ్లు దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఈ ప్రాంతానికి వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ ప్రాంతంలో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాళ్ల: మత్తు పదార్థాలు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కాళ్ల ఎస్సై ఎస్‌.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కాళ్లకూరులో సోమవారం పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల రవాణా, వినియోగం చట్టవిరుద్ధమని, డీసీపై ఏపీ ప్రభుత్వం 'ఈగల్‌' బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఆదేవిధంగా సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చిన్న పిల్లలు, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై ఎటువంటి కేసులు నమోదవుతాయని విషయాలపై అవగాహన కల్పించారు.

డీఎన్నార్‌లో లా విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

భీమవరం: స్థానిక డీఎన్నార్‌ లా కళాశాలలో ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒరిజినల్‌ సర్టిఫికెట్లను సోమవారం కళాశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ న్యాయవాదులు పేద లకు తమవంతు సేవ చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్‌ కె.రామచంద్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ వై అశోక్‌ కుమార్‌, అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, చిత్ర భాను పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

భీమవరం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని దళిత బహుజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా సుందర కుమార్‌ అన్నారు. గంటా పాలెస్‌ట్రస్ట్‌ ఆధ్వర్యంలో మండలంలోని రాయలంలోని లూథరన్‌ చర్చిలో సోమవారం 350 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఎలిఫెంట్‌ ఫ్యాక్స్‌ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా రాజకుమార్‌ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో నాలుగు జిల్లాలో విద్యార్థులకు 1.50 లక్షల పుస్తకాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, బుద్ధిస్ట్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోను జోసెఫ్‌, ఎస్‌ఎస్‌ శ్రీకర్‌, తాడి రాజశేఖర్‌, పెన్మెట్స ప్రసాద్‌ పాల్గొన్నారు.

సంక్షోభంలో గీత కార్మికులు

ఆకివీడు: కల్లు గీత కార్మికుల రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్నారని గీత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్కా వంటి ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆకివీడు సర్కిల్‌లోని గీత కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలను జిల్లా కలెక్టర్‌ అమలుచేసేవిధంగా ఈ నెల 14న గీత కార్మికుల మొకలు ధరించి రావాలని పిలుపునిచ్చారు. మద్యం ఆదాయం కావాలా? ప్రజల ఆరోగ్యం కావాలా? అనేది ప్రభుత్వం తేల్చుకోవాలని హెచ్చరించారు. బెల్టు షాపుల పేరితే బెల్టు తీస్తామని, బెల్టు షాపులపై కొరడా ఝులిపిస్తామని చెప్పి వారిపై జాలి చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎం.సత్యనారాయణ, వి.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్‌, పి.సూరిబాబు, ఎం.వెంకటేశ్వరరావు,ఎస్‌.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం

కాళ్ల: గ్రామంలో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీతా వరదరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత నూతనంగా ఏర్పాటు చేసిన జెండా స్తూపాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీను, యార్లగడ్డ రత్నరాజు, సర్పంచ్‌ బందా విజయప్రసంగి పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో సోమవారం ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌ నాయకుడు బాలం వెంకటేశ్వరరావు ఆ పార్టీ జెండా స్తూపాన్ని ఆవిష్కరించారు. తానేటి నాగరాజు, తానేటి సందీప్‌, అద్దాల శ్రీరామమూర్తి, సుదుపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

రాజన్నా.. నీ మేలు మరువలేం


వైఎస్సార్‌ పాలనలో కొనుగోలు చేసిన 82 ఎకరాల భూమిలో నిర్మించిన టిడ్కో ఇళ్లు


తాడేరు రోడ్డులో నాడు వైఎస్సార్‌ పాలనలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు


కొల్లేరు తీర గ్రామాల ప్రజల కోసం రూ. 3 కోట్లతో నిర్మించిన సిద్ధాపురం వంతెన

- వైఎస్‌ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు నెరవేరిన సొంతింటి కల
- అనేక అభివృద్ధి పనుల్లో తనదైన ముద్ర

భీమవరం (ప్రకాశం చౌక్‌): మహానేత రాజశేఖరరెడ్డి పాలన పేదలకు స్వర్ణయుగంలా సాగింది. నాడు రాజన్న పాలనలో పేదలకు సొంతింటి కల నెరవేరింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదింటి బిడ్డలు పెద్ద చదువులు చదివి నేడు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. పేదల ఆరోగ్యం కోసం ఆప్పటివరకు ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం చేసి ఆర్థిక ఇబ్బంది ఉంటుందని తెలిసి కూడా ముందడుగు వేసి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం వేలాది మంది పేదల ప్రాణాలను నిలిపింది. ఆరోగ్యశ్రీ నేటికీ పేదల ప్రాణాలను కాపాడుతునే ఉంది. అంతటి గొప్ప పాలన అందించిన మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడే. మంగళవారం వైఎస్సార్‌ జయంతి సందర్భంగా ఆయన భీమవరం నియోజకవర్గం ప్రజలకు చేసిన మేలును గుర్తు చేసుకుందాం. నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా నాడు అనేక శాశ్వత పనులు చేయడంతో నేడు ఆ ఫలాలు నియోజకవర్గం ప్రజలు పొందుతున్నారు.

అభివృద్ధి పనులు ఇలా

వైఎస్‌ రాజశేఖరరెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భీమవరంలో పేదవారికి ఇల్లు కట్టుకోవడానికి భూమి ఇవ్వాలని ఆలోచనతో భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ సహకారంతో గునుపూడి ప్రాంతంలో సుమారు 20 కోట్లతో 82 ఎకరాలు భూమి కొనుగోళ్లు చేయించారు. అదే 82 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు నిర్మించారు. తాడేరు రోడ్డులో పేదల కోసం నాడు దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ఒకేచోట ఇందిరమ్మ కాలనీ ఉండాలని సూచనతో 700 ఇళ్లు మంజూరు చేయగా నాటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు.

పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండకూడదని భావించి వేండ్ర, భీమవరం వయా పైపుల చెరువు రోడ్డులో సుమారు రూ.2 కోట్లతో 120 ఎకరాల భూమిని కొనుగోలు చేయించి 60 ఎకరాల్లో చెరువు తవ్వించారు. సీఆర్డీ కార్పొరేషన్‌ ద్వారా 600 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందించారు.

భీమవరం పట్టణం, భీమవరం మండలం మీదుగా ప్రవహించే యనమదుర్రు డ్రెయిన్‌పై రాజశేఖర్‌రెడ్డి పాలనలో అనేక బోట్ల వంతెనలను నిర్మించారు. నాగిడిపాలెం, లోసరి, బైపాస్‌రోడ్డు, ఎల్‌వీఎన్‌పురం, దేగ పూరం తదితర వంతెనలను వైఎస్సార్‌ హయాంలోనే నిర్మించారు. అలాగే ఆరు విద్యుత్‌ సబ్‌స్టేషన్లు, భీమవరంలో గ్రంథాలయం కట్టించారు.

స్వర్ణ యుగాన్ని తలపించిన పాలన

ఆకివీడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌.రాజశేఖరరెడ్డి పరిపాలన ఉండి నియోజకవర్గ ప్రజల హృదయాల్లో గూడు కట్టుకుంది. నలభైఏళ్లగా సొంత ఇంటి కోసం పోరాటాలు చేస్తున్న నిరుపేదల కోసం కుప్పనపూడి శివారు తాళ్లకోడులో 74 ఎకరాల భూమిని రూ. 7 కోట్లకు కొనుగోలు చేసి, రూ. 5 కోట్లతో పూడిక పనులు పూర్తి చేసి పేదవారి సొంతింటి కలను నెరవేర్చే దిశగా పట్టాలు పంపిణీ చేశారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు పేదల ఇళ్ల నిర్మాణం పట్టించుకోలేదు. వైఎస్సార్‌ తనయుడు వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలకు పట్టాలు అంది, ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. కొల్లేరు తీర ప్రాంత గ్రామాల్ని కలిపే వారధి సిద్ధాపురం వంతెనకు రూ. 3 కోట్లతో నిర్మించారు. ఏళ్ల తరబడి వంతెన నిర్మాణం కోసం పోరాటాలు చేసి, ఎన్నికలను బహిష్కరించిన చినమిల్లిపాడు గ్రామ ప్రజల చిరకాల కోరిక ఓట్ల వయ్యేరుపై రం తెనను అప్పటి ఎమ్మెల్యే దివంగత పాతపాటి సర్రాజు మూడు నెలల్లో నిర్మించారు. ఆదిగిన వెంటనే నిధులను మంజూరు చేసిన వైఎస్సార్‌ను రుణపడి ఉంటామని ఆ గ్రామం నేటికీ కట్టుబడి ఉంది. నియోజకవర్గంలోని 60 గ్రామాలకు మంచినీరందించే వెంకయ్య వయ్యేరు పంట కాలువ నెలనెటీ నీటితో కలుషితమైపోయిందని ప్రజలు పాదయాత్రలో సర్వేయ రాజశేఖరరెడ్డికి మొరపెట్టుకోగా వెంటనే రూ. 30 కోట్లు మంజూరు చేసి, పైప్‌లైన్‌ నిర్మాణానికి ఆకివీడు వచ్చిన వైఎస్సార్‌ స్వయంగా భూమి పూజ చేశారు. పైప్‌లైన్‌ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు రక్షిత మంచినీటి పథకాల్ని ప్రతీ గ్రామంలో రెండు, మూడు ఉండే విధంగా నిర్మాణాలు చేశారు. ఉండి మండలంలో 220 కేవీ సబ్‌ స్టేషన్‌ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు లోవోల్టేజీ సమస్యల్ని నియోజకవర్గంలో పరిష్కరించారు. రొయ్యల చెరువుల వృద్ధి చెందుతున్న రోజుల్లో నిరంతర విద్యుత్‌ అందజేశారు. కాళ్ల మండలం కోనంపల్లి, పాతాళ్లమెరక గ్రామాల్లో పేదల ఇళ్ల కాలనీ నిర్మించారు.

లోకో పైలెట్‌ అయ్యాను



దివంగత వైఎస్‌ రాజశేఖరరెడ్డి పాలనలో ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నేను ఇంజినీరింగ్‌ చదువుకున్నాను. చదువు పూర్తి చేశాక రైల్వేలో లోకోపైలెట్‌ ఉద్యోగం సాధించాను. నేడు సీనియర్‌ అసిస్టెంట్‌ లోకో పైలెట్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల వచ్చిన వందే భారత్‌ ట్రైన్‌ను కూడా నడిపే స్థాయికి వచ్చానంటే నాడు దివంగత నేత రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ కారణం. ఆయన మేలు ఎప్పటికి మర్చిపోలేను.

– కడలి బాలకృష్ణ, పడమటిపాలెం, వీరవాసరం

ఆయన పాలన స్వర్ణయుగం



వైఎస్సార్‌ పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలకు లోటు లేదు. ఎక్కడ సమస్య ఉన్నా, ఎం త సొమ్ము అయినా వెంటనే మంజూరు చేసి పనులు మొదలుపెట్టి పూర్తి అయ్యేవరకూ ఎవరినీ నిద్రపోనిచ్చేవారు కాదు. వైఎస్సార్‌ పాదయాత్రలో అడుగులో అడుగు వేసి నడిచిన ఆనందం నేటికీ మరువలేను. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్‌ పాలనలో రూ.800 కోట్లకు పైగా అభివృద్ధి జరిగింది.

–మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌, ఆకివీడు

నేడు నరసాపురంలో మెగా రక్తదాన శిబిరం

భీమవరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నరసాపురంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజనవిభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్‌ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నరసాపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రక్తదానశిబిరాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఆకివీడు: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలుచేస్తున్న మోదీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షులు పెంకి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పోస్టుమాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్‌: సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని వెంప, పెదగరువు, తుందుర్రు గ్రామాల్లో సమ్మెను విజయవంతం చేయాలని సోమవారం సీఐటీయూ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.

భారత విద్యార్థి ఫెడరేషన్‌ మద్దతు

భీమవరం: లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత విద్యార్థి ఫెడరేషన్‌ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.గణేష్‌, టి.ప్రసాద్‌ తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు.


పోస్టు మాస్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సచివాలయ సిబ్బందికి సత్కారం

కాళ్ల: గ్రామంలో ప్రజలకు విశిష్టమైన సేవలందించిన అందరి మన్ననలు పొందిన అదనపుసహాయమని వేంపాడు సర్పంచ్‌ ఇ.పద్మావతి కొనియాడారు. వేంపాడు గ్రామంలో సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సోమవారం సచివాలయంలో ఘనంగా సత్కరించారు.









గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌ బృందం పర్యటన

ఉండి: మండలంలోని ఆరేడు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌ గ్రామీణ్‌ 2025 బృందం సోమవారం పర్యటించింది. పంచాయతీ కార్యాలయం, సంపద సృష్టి కేంద్రం, మరుగునీటి పారుదల, పాఠశాల్లు, వ్యక్తిగత మరుగు దొడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్‌ కేంద్రం సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్నల్‌ టీమ్‌ సభ్యులు దినేష్‌, రామకృష్ణ, టెక్నికల్‌ కో–ఆర్డినేటర్‌ ఎస్‌.ఏ. దుర్గ, డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్‌ఎస్‌వీ రెడ్డి, సర్పంచ్‌ కె.బ్రహ్మానందం, కార్యదర్శి పి.ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వనుల పర్యవేక్షణను తీరును జిల్లా స్వచ్ఛ సర్వేక్షణ్‌ బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఇంటింటి సర్వేతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రం, దేవాలయాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని తెలుసుకుని ఫొటోలు తీసుకున్నారు. ఈ పరిశీలనలో స్వచ్ఛ సర్వేక్షణ్‌ జిల్లా కోఆర్డినేటరు ఎం. మధుమతి, పి.సత్తిబాబు, జిల్లా కన్సల్టెంట్‌ ఎం.సంతోషకుమార్‌, ఎంపీడీ వీరవల్లి దుర్గాభవాని, సర్పంచి చికిలే మంగతాయారు పాల్గొన్నారు.


ఆరేడులో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృంద సభ్యులు

నేడు ఆకివీడులో వైఎస్సార్‌ జయంతి

ఆకివీడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక వైఎస్సార్‌ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు అంబటి రమేష్‌, సంద్యాల సీతారామయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 100 మందికి దుప్పట్లు పంపిణీ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కాళ్లకూరు సొసైటీలో నూరు శాతం రుణ రికవరీ

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు సహకార సంఘం పరిధిలో 2024–25 సంవత్సరానికి రైతుల నుంచి రుణ బకాయిలను నూరు శాతం వసూలు చేసినట్లు సొసైటీ సీఈఓ ఐ.శ్రీనివాస్‌, అఫీషియల్‌పర్సన్‌ ఇన్‌ఛార్జి కె.వర్ధిని తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సంఘ సభ్యుల నుంచి రావాల్సిన వివిధ రకాల రుణాలు మొత్తం సుమారు రూ.19.48 కోట్లు వసూలు చేసినట్లు వివరించారు. గత 29 ఏళ్లుగా నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

భీమవరం: చిల్డ్రన్‌ ఇస్లామిక్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు జమాతె ఇస్లామీ హింద్‌ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్‌ అన్సర్‌ చెప్పారు. జమాతె ఇస్లామీ హింద్‌కు అనుబంధ సంస్థ అయిన చిల్డ్రన్‌ ఇస్లామిక్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రా మదర్సాలోని చిన్నారులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌(ఎంఏపీ) మునిసిపల్‌ ప్రైమరీ స్కూలు అవరణ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఐసీఎస్‌ స్కూల్‌ హెడ్‌ మాస్టర్‌ షేక్‌ బాబాజీ సాహెబ్‌, చిల్డ్రన్‌ ఇస్లామిక్‌ ఆర్గనైజేషన్‌ నిర్వాహకులు అమీన్‌, సుభాని, సాహిల్‌, సయ్యద్‌ బాజీ పాల్గొన్నారు.

అనధికార వంతెన నిర్మాణంపై అభ్యంతరం

కాళ్ల: కాళ్ల, కోలనపల్లి, దొడ్డనపూడి గ్రామాలకు సాగు, తాగునీరు అందించే కె.లంక పంటకాలువపై ప్రైవేటు వ్యక్తులు అనుమతులు లేకుండా అనధికారకంగా వంతెన ఏర్పాటు చేసి కోటకాలికి కాలువను పూడ్చి వేయడంపై కాళ్ల గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నీటి సంఘం ప్రతినిధులతో కలిసి పలువురు రైతులు ఆప్రాంతాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. కోమటిగుంట – కోలనపల్లి పుంతరోడ్డు ప్రాంతంలో పంటకాలువపై ఉన్న పాత ఇనుపవంతెన తొలగించి, కొత్తగా మరోక వంతెన వేసుకోవడం కోసం కాలువకు ఇరువైపులా తడికెలు కట్టి మట్టితో కాలువను పూడ్చివేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల కాలువకు శివారు ఉన్న తమ గ్రామాలకు వచ్చే నీటి ప్రవాహానికి ఇబ్బంది తలెత్తుతుందన్నారు. ఇప్పటికే చాలాచోట్ల కాలువ పూర్తిగా పూడుకుపోయిందన్నారు. దీనిపై ఇరిగేషన్‌ఏఈ ఆర్‌ ఫణి శంకర్‌ను వివరణ కోరగా కాలువను పూడ్చివేసినట్లు తన దృష్టికి వచ్చిందని, అక్కడ వంతెన ఏర్పాటు చేసుకోవడం కోసం తమ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, సిబ్బందిని పంపి వేసిన మట్టిని తొలగిస్తామన్నారు.


కాలువను పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతులు, నీటి సంఘం ప్రతినిధులు

ప్రమాద బాధితుడికి పరామర్శ

భీమవరం అర్బన్‌: మండలంలోని గుట్టపాడు గ్రామంలో గత జూన్‌ నెలలో బిల్డింగ్‌పై ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలపాలైన సంది దానియేల్‌ను వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చినిమిల్లి వెంకట్రాయుడు పరామర్శించారు. ఆధైర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని దానియేల్‌కు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కన్వీనర్‌ జల్లా కొండయ్య, సర్పంచ్‌ ఒడుగు ముత్యాలరావు, వైస్‌ ఎంపీపీ తిరుమాని ధనంజయరాజు, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తులసీరావు, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, మద్దా ఫిలిప్‌, రేవు నరసింహస్వామి తదితరులు ఉన్నారు.


దానియేలును పరామర్శిస్తున్న చినిమిల్లి వెంకట్రాయుడు

అల్లూరి మెమోరియల్‌ హాల్‌ నిర్మించాలని నిరసన


నిరసన నిర్వహిస్తున్న సాధన కమిటీ సభ్యులు


మోషేనురాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని పాత బస్టాండ్‌ వద్ద తొలగించిన అల్లూరి సీతారామరాజు భవనం తిరిగి నిర్మించాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం అల్లూరి మెమోరియల్‌ హాల్‌ సాధన కమిటీ భవనం స్థలం వద్ద నిరసన నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సాధన కమిటీ గౌరవాధ్యక్షుడు కుమారరాజు సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో నిర్మించిన అల్లూరి భవనం శిథిలమైందని తొలగించి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ తిరిగి నిర్మించకపోవడం దారుణమన్నారు. సాధన కమిటీ సభ్యుడు బి.బలరామ్‌ మాట్లాడుతూ సీతారామరాజు స్మారక భవనం దశాబ్దాల తరబడి భీమవరం పరిసర గ్రామాల ప్రజలకు విశేషమైన సేవలందించిందన్నారు. అనంతరం మెమోరియల్‌ హాల్‌ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్‌ కొయ్యే మోషేనురాజు, కేంద్రసహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభసభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్‌, కంతేటి వెంకటరాజు, బివాసుదేవరావు, చెరుకువాడ రంగసాయి, ఎం సీతారామ్‌ప్రసాద్‌, దండు శ్రీనివాసరాజు, ఎం వైజంక కృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్‌): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలత్రిపుర సుందరి అమ్మవారికి వెండి మకర తోరణానికి సోమవారం దాతలు 100 గ్రాముల వెండిని సమర్పించారు. వెనిగలెట్టి రాష్ట్రీ సుబ్రహ్మణ్య ప్రసాద్‌, వెంకటలక్ష్మి దంపతులు వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. దాతలకు కె.శ్రీనివాస్‌ అర్చకుడు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

త్వరితగతిన సార్వా వరి నాట్లు పూర్తి చేయాలి

భీమవరం అర్బన్‌: సార్వా వరినాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్‌ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని గునుపూడిలో సోమవారం ఏవో ప్రసాద్‌ వరినాట్లును పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్‌ మాట్లాడుతూ పంటకాలువలకు ఇప్పటికే పూర్తిస్థాయిలో సాగునీరు సమృద్ధిగా వస్తుందని మరోవైపు వర్షాలు కూడా పడుతున్నాయని, కాబట్టి రైతులు త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలన్నారు. ముందు వరినాట్లు పూర్తి చేయడం వల్ల సెప్టెంబర్‌, అక్టోబర్‌ నెలల్లో వచ్చే భారీ వర్షాలు, తుఫాన్‌ల నుంచి పంటను రక్షించుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా వరినాట్లు వేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వరినాట్లు వేసేటప్పుడు నారు లేతాకుపచ్చగా ఉంటేనే మూన త్వరగా పడుతుందన్నారు. 4 నుంచి 6 ఆకులున్న నారిని తీసుకుని నాట్లు వేయాలన్నారు.

